క్లుప్తంగా

మిసైల్ మేన్ కలామ్‌ను మరిచారా!

సామర్లకోట: ఇస్రో శాస్త్రవేత్త, మిసైల్ మేన్‌గా ఖ్యాతి గడించిన మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజె అబ్దుల్ కలామ్‌ను పట్టించుకున్న వారు కరువయ్యారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కానీ స్వచ్ఛంద సంస్థలు కానీ ఎవరూ ఆయన చిత్ర పటానికి కనీసం పూల మాల వేసిన దాఖలాలు లేవు. శాస్త్రవేత్తగా కలామ్ భారత సైన్యం కోసం చిన్న హెలికాఫ్టర్‌ను తయారు చేయడం ద్వారా గుర్తింపు పొందారు. 1981 నుంచి 2014 వరకు 17 పురస్కారాలను అందుకున్న అటువంటి వ్యక్తిని మరచి పోవడం బాధగా ఉన్నదని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

31న క్రైస్తవ సేవకుల సదస్సు

సామర్లకోట: ఈ నెల 31వ తేది ఉదయం 10 గంటల నుంచి క్రైస్తవ సేవకుల సదస్సు నిర్వహించనున్నట్టు మండల పాస్టర్ల సంఘ సభ్యుడు ఆనందబాబు తెలిపారు. స్థానిక బ్రౌన్‌పేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో వాక్ విత్ క్రైస్ట్ ఔట్‌రీచ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియాకు చెందిన అంతర్జాతీయ వర్తమానికులు రాజేంద్ర దత్తు పానుకు హాజరై సువార్తలు అందజేస్తారని తెలిపారు. ఈ సేవకుల సదస్సులో క్రైస్తవులు, అభిమానులు హాజరు కావాలన్నారు.

ఉత్సాహంగా బీజేపీ సభ్యత్వాలు



సభ్యత్వాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గంగరాజు

సామర్లకోట: బీజేపీ సభ్యత్వాలు సెప్టెంబరు 2 నుంచి మంగళవారం వరకు జరిగాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ గంగరాజు తెలిపారు. రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లో 5,200 సభ్యత్వాలను నమోదు చేసినట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వాల ముగింపు సందర్భంగా స్థానిక సంపెంగ తోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సభ్యత్వాల నమోదు కన్వీనర్ గౌరకపూడి చిన్నయ్యదొర, కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏడిద కృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు బక్కి వీర్రాజు, మాజీ జిల్లా అధ్యక్షుడు సుంకవిల్లి బాపిరాజు, బీజేపీ నాయకులు వలూరి బుల్లియ్య, పెన్నాడ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా కేదారి



పెద్దాపురం: సీపీఎం మండల కార్యదర్శిగా కేదారి నాగు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వరలహాయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం ఎం.సత్తిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాసభ పరిశీలకునిగా వచ్చిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, నీలపాల సూరిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్యలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరదలు వచ్చేటప్పుడు ఏటి పట్టు గ్రామాలు నీట మునుగుతున్నాయన్నారు. నవంబర్ 15, 16, 17 తేదీల్లో జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం శాఖ కార్యదర్శిగా కేదారి నాగును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు



పనసపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: మండల పరిధిలోని పనసపాడు గ్రామంలో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు చేయడానికి శంకుస్థాపన చేసినట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. పల్లె పండగలో భాగంగా మంగళవారం పనసపాడు గ్రామంలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను స్థానిక ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు వేసి వాటిని సంరక్షించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ చీకట్ల వెంకటేష్ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఈఓపీఆర్డీ భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కడలి పుత్రులకు రక్షణ కరవు..!

ఉప్పాడ తీర ప్రాంతం ప్రమాదకరంగా మారింది. గతంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో తీర ప్రాంత రక్షణకు నిర్మించిన జియోట్యూబ్(రక్షణ గోడ) నేడు పూర్తిగా తాడు తెగి సముద్ర గర్భంలో కలిసి పోవడంతో తీరప్రాంతానికి రక్షణ కరువయ్యింది. దీంతో ఉప్పాడ తీరప్రాతంలోని మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ బతుకులు వెళ్లదీస్తున్నారు. తమను పట్టించుకునే నాథుడు లేక కడలి పుత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

- ప్రమాదకరంగా మారిన ఉప్పాడ తీరం
- సాగర గర్భంలో కలిసిపోయిన రక్షణగోడ
- మూడొంతుల తీర ప్రాంతం కనుమరుగు
- సంద్రంలో కలిసిపోతున్న నివాస గృహాలు
- భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్న మత్స్యకారులు



రక్షణ గోడ లేక సముద్ర గర్భంలో కలిసిన తీరం



కోతకు గురవుతున్న తీరప్రాంత మత్స్యకార గృహాలు



సముద్ర గర్భంలో కలుస్తున్న సీసీ రోడ్డు

కొత్తపల్లి: ఎన్నో భారీ తుఫాన్‌లు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఉప్పాడలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన రక్షణ గోడ దీటుగా ఎదుర్కొంది. అయితే ఈ గోడ నిర్మాణం నుంచి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇప్పుడు సాగర పుత్రుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణ దశలో సుమారు రూ.12 కోట్లు వెచ్చించి జియోట్యూబ్ టెక్నాలజీతో నిర్మించిన రక్షణ గోడ నేడు సాగర గర్భంలో కలసి పోయింది. రోజురోజుకూ గోడ నిర్మాణానికి ఉపయోగించే నైలాన్ తాడు తెగిపోతూ రాళ్లు చెల్లాచెదురై తీరప్రాంతం కోతకు గురైంది. ఇప్పటికే ఉప్పాడలో సుమారుగా మూడొంతుల తీరప్రాంతం సముద్రంలో కలిసిపోయింది. తుఫాన్‌లు వచ్చినప్పుడల్లా తీవ్రమైన కోతకు గురి కావడం..అధికారులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగా మారింది. తీర ప్రాంత రక్షణకు శాశ్వత పరిష్కారం చేపట్టకపోతే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. సుమారు 58 ఏళ్లలో ఏటా 2 నుంచి 3 తుఫాన్‌లు చొప్పున ఇప్పటి వరకూ 100కు పైగా తుఫాన్‌లు సంభవించాయని మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో ఈ తీరప్రాంతంలో 3 ట్రావెల్ బంగళాలు, 2 పొగాకు బీడు కేంద్రాలు, సుమారు 200 ఎకరాలకు పైగా సరుగుడు తోటలు, 700కు పైగా గృహాలు సముద్ర గర్భంలో కలసిపోయాయని పేర్కొన్నారు. ఉప్పాడ తీరప్రాంతం కిలోమీటర్ల మేర కోతకు గురవ్వడంతో కోట్ల రూపాయల ఆస్తులు, విలువైన భూములు, ప్రభుత్వ భవనాలు కడలిలో కలిసిపోయాయి.

తీరప్రాంతాన్ని రక్షించింది

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మాజీ కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు చొరవతో సుమారు రూ.12 కోట్లు వెచ్చించి ఉప్పాడ తీరప్రాంతంలో సుమరు రెండు కిలోమీటర్ల మేర రక్షణ గోడ నిర్మించారు. అనేక తుఫాన్‌లతో పాటు పెను విలయం సృష్టించిన హుదూద్ తుఫాన్ నుంచి ఉప్పాడ తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణగోడ రక్షణగా నిలిచింది. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవతో నిర్మించిన రక్షణగోడ ఇప్పటి వరకు తీర ప్రాంత ప్రజలతో పాటు వారి ఆస్తులను, ఉప్పాడ గ్రామాన్ని సముద్రపు కోత నుంచి కాపాడగలిగింది.

రక్షణ చర్యలు చేపట్టాలి



తీర ప్రాంత గ్రామాలు కోతకు గురి కాకుండా ప్రభుత్వం శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలి. తుపానులు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లు కారణంగా కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడడంతో తీర ప్రాంతం, గృహాలు కళ్లముందే సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన రక్షణగోడే మాకు రక్షణగా నిలిచింది. ఆయన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ గోడ రక్షణను పట్టించుకోలేదు. దీంతో ఈ గోడ ఇప్పుడు సముద్ర గర్భంలో కలిసిపోయింది.

ఎల్లాజీ, ఎంపీటీసీ సభ్యుడు,ఉప్పాడ.

తీరప్రాంత రక్షణ గాలికి..



తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, కోపపాపపేట తీరప్రాంతంలో ఉన్న గృహాలు కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉప్పాడ తీరప్రాంతలో పర్యటించారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులను ఎవరినీ కూడా సమస్యలు అడిగి తెలుసుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తీరప్రాంత సమీపంలో ఉన్న ప్రతి మత్స్యకార కుటుంబానికి ఇళ్ల స్థలాలను కేటాయించడమే కాక ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను సైతం మంజూరు చేసింది. వైఎస్సార్ హయాంలో నిర్మించిన జియోట్యూబే తీర ప్రాంతానికి సుమారుగా పదేళ్లపాటు రక్షణగా నిలిచింది.

ఉమ్మిడి జాన్, మాజీ సర్పంచి, ఉప్పాడ.

వైఎస్సార్ హయాంలో రక్షణ పొందాం



దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన రక్షణగోడే మాకు రక్షణగా నిలిచింది. ఆయన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ గోడ రక్షణను పట్టించుకోలేదు. దీంతో ఈ గోడ ఇప్పుడు సముద్ర గర్భంలో కలిసిపోయింది. దీంతో మా గృహాలు కోతకు గురవుతున్నాయి. తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు కోపపాపపేటలో ఇళ్ల స్థలాలను కేటాయించారు.

కొవ్విరి రాజమ్మ,
ఉప్పాడ మత్స్యకార మహిళ.

రేషన్ సరకులు అందక అవస్థలు



రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన 23వ వార్డు లబ్ధిదారులు

- 11వ సచివాలయం పరిధిలోకి రాని ఎండీయూ వాహనం
- సరకులు ఇవ్వాలని డీలర్లకు తహసీల్దార్ ఆదేశాలు
- 23వ రేషన్ దుకాణం పరిధిలో మద్యం దుకాణంతో అవస్థలు
- మండలంలో ఏడు రేషన్ షాపులకు ప్రతిపాదనలు

సామర్లకోట: స్థానిక 11 సచివాలయంలోని రేషన్‌దారుల కష్టాలు ప్రారంభం అయ్యాయి. సచివాలయం పరిధిలోని 22, 23 వార్డులకు చెందిన వారికి 15 తేదీ వచ్చినా ఎండీయూ వాహనాల ద్వారా సరకులు అందలేదు. దాంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి లబ్ధిదారులకు సత్వరం సరకులు సరఫరా చేయాలని ఆయా ప్రాంతాల సమీపంలోని రేషన్ డీలర్లను ఆదేశించారు. ఈ ఆదేశాలతో 23వ వార్డులోని రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఈ వార్డుకు చెందిన రేషన్ షాపు జయలక్ష్మి థియేటర్ సమీపంలో ఉంది. దీనికి సమీపంలోనే ఆ థియేటర్ రోడ్డులో మద్యం దుకాణం ఉండడంతో ఆ రేషన్ షాపునకు వచ్చే సత్యనారాయణపురం, అప్పయ్యచెరువు, మాజేటి నగర్ ప్రాంతాలకు చెందిన రేషన్ లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ షాపుల ద్వారా సరకులు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తుండడంతో మండల పరిధిలో అదనంగా మరో ఏడు రేషన్ షాపులకు ప్రతిపాదనలు పంపారు. పట్టణ, మండల పరిధిలో 75 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అమ్మాణమ్మ అపార్టుమెంటులో రెండు, గాంధీనగర్‌లో ఒకటి, రాజీవ్ గృహకల్పలో ఒకటి, వేట్లపాలెంలో ఒకటి, మాధవపట్నంలో ఒకటి, వీకే రాయపురంలో మరో షాపు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయా రేషన్ షాపులలో ఎక్కువ కార్డులు ఉన్న వాటి కోసం మరో షాపు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఈ ప్రతిపాదనలు పంపారు. దాంతో ఎండీయూ వాహనాలు రద్దు చేస్తారనే విషయం స్పష్టమవుతోంది. అయితే ఎండీయూ వాహనాలకు ప్రభుత్వ సబ్సిడీ మొత్తం చెల్లించాల్సి ఉండడంతూ జాప్యం ఆ వాహనాల నిలిపివేతలో జాప్యమవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులకు వివరిస్తున్న ఏఓ తదితరులు

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం గ్రామ సర్పంచ్ దేవళ్ల దుర్గా వరలక్ష్మి దేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఓ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో తెగులు, చీడల గురించి వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలన, ఎర తయారీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ కోటి మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పశువులకు టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రైతు పశువులకు బీమా చేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్‌వీవీ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సాహితి, శ్రీవాణి, అఖిల్, రైతులు పాల్గొన్నారు.

అమాయకులపై రౌడీ షీట్లు తొలగిస్తాం

డీఎస్పీ రఘువీర్ విష్ణు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

పిఠాపురం: అమాయకులపై రౌడీ షీట్లు తొలగిస్తామని నిజంగా రౌడీయిజం చేసే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. ఆయన మంగళవారం గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఎటువంటి పైరవీలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదన్నారు. రికార్డులు తనిఖీ చేసి పోలీసు స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ తదితరులున్నారు.

అభ్యసన వైకల్యాలను అధిగమించాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



నవర జెడ్పీ పాఠశాల నుంచి నిర్వహించిన ర్యాలీలో ఎంఈఓ-2 పుల్లయ్య తదితరులు



చంద్రమాంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: కొంత మంది విద్యార్థులు బిగ్గరగా చదవడంలో, రాయడంలోను కొంతమేర ఇబ్బంది పడుతూ డిస్లెక్షియా అనే లోపంతో ఉంటారని, అటువంటి వారు అభ్యసన స్థాయి పెంచుకుంటే పురోగతి సాధించే అవకాశం ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వై.శివ రామకృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ స్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన డిస్లెక్సియా అవేర్నెస్ మాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ డిస్లెక్సియా బాధితుల్లో ప్రముఖ సైంటిస్టు ఐన్‌స్టీన్, అబిషేక్ బచ్చన్ వంటి వారు ఉన్నారని, వారు ఆ లోపాన్ని అధిగమించి పొందిన స్థానాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అభ్యసన వైకల్యాలు అధిగమించి అందల మెక్కడం కష్టమేమి కాదని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులచే వాక్ ఫర్ డిస్లెక్షియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే మండల పరిధిలో నవర గ్రామంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో కలిసి ఎంఈఓ-2 పి. పుల్లయ్య డిస్లెక్సియా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.దుర్గా రాంబాబు, హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి, ఉపాధ్యాయులు జవీవ ప్రసాద్, బేబీ నాగేశ్వరీ, భవిత స్కూల్ ఆర్పీలు అనిత, పద్మావతి పాల్గొన్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం: అభ్యసన వైకల్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర శర్మ, చౌదరి అన్నారు. డిస్‌లెక్సియా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, పట్టణంలోని లూథరన్ హైస్కూల్ విద్యార్థులచే మంగళవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థుల్లో పురోభివృద్ధి సాధించడానికి పిల్లల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రమాంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.నాగజ్యోతి, ఉపాధ్యాయిని ఎం.వీరభవాని, భవిత ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం సీహెచ్‌సీ ఆధునీకరణకు చర్యలు

జిల్లా కలెక్టర్ షణ్మోహన్



ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

పిఠాపురం: పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సీహెచ్‌సీ) ఆధునీకరించడంతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమిస్తామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. పిఠాపురం సీహెచ్‌సీకి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మిషన్, ఇతర వైద్య పరికరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. సీహెచ్‌సీ అవుట్ పేషెంట్ వివరాలు, ప్రస్తుత ఆసుపత్రి అవసరాలు, మరుగుదొడ్ల పరిస్థితి, తాగునీరు ఇతర సదుపాయాలు వంటి వివరాలను కలెక్టర్ ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రసూతి విభాగం వార్డు, వాటిలో వసతులను పరిశీలించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు పిఠాపురం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌సీని అన్నివిధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నిత్యం నమోదవుతున్న ఓపీ సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రిని ఆధునీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, సిబ్బందిని నియమించడంపై దృష్టి సారించామన్నారు. సీహెచ్‌సీకి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.15 లక్షలతో ఎక్స్‌రే మిషన్ సమకూర్చిందన్నారు. నేటి నుంచి ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ఎన్ వర్మ, జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాసు, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు, సీహెచ్‌సీ సూపరిండెంట్ డా.సుజాత, పిఠాపురం కమిషనర్ కనకారావు, తహసీల్దార్ వివి.గోపాలకృష్ణ, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ కాకినాడ జిల్లా యూనిట్ హెడ్ సీహెచ్.శ్రీనివాసరావు, జీఎం హెచ్ ఆర్ పి.పద్మనాభం, సీఎస్ఆర్ మేనేజర్ కె.వంశీ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు

పిఠాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. తొలుత ఆయన పాఠశాలలోని మరుగుదొడ్లు, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం, మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు ఇతర పనులను పరిశీలించారు. పిఠాపురం నియోజకవర్గంలో క్రీడా మైదానాలు ఉన్న 32 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామన్నారు. రూ.16 లక్షల నిధులతో ప్రతి పాఠశాలకు 21 రకాల క్రీడా పరికరాలతో కూడిన రెండేసి కిట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. తొలిదశలో భాగంగా మంగళవారం 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్క కిట్ చొప్పున పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పిడుగు పడి గేదె మృతి



చనిపోయిన గేదెను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని పాత ఇసుకపల్లి ఉప్పరగూడెంలో గొల్లపల్లి కృష్ణకి చెందిన గేదెల పాకపై సోమవారం రాత్రి పిడుగు పడింది. పాకలోని మూడు గేదెలలో ఒకటి మృతి చెందగా, రెండు తీవ్రంగా గాయపడ్డాయి. పశువుల పాకపై పూర్తిగా కాలిపోయింది. నాగులాపల్లి పశువైద్యాధికారి ఎస్.సందీప్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లి ఉంటుందన్నారు.

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ జామ్



వీకే రాయపురం-మాధవపట్నం మధ్య నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో వీకే రాయపురం-మాధవపట్నం మధ్యలో మంగళవారం ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ రోడ్డులో పెద్ద గోతులు ఎక్కువగా ఉండటం, సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో గోతుల్లో నీరు చేరింది. దీంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ రోడ్డులో గోదావరి, ఏలేరు నీరు ఉధృతంగా ప్రవహించి రోడ్డుపైకి నీరు రావడంతో వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. రెండు రోజుల క్రితం కాకినాడ నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న దంపతుల మోటారు సైకిల్ గోతిలో పడడంతో అదుపుతప్పి కింద పడిన మహిళ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.